

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి : కలెక్టర్

కడప, కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గండికోట లోయ వద్ద ఈ నెల 18న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని, యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జూన్ 18న గండికోట లోయ వద్ద ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని సూచించారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

కడపక్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఆయన ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేశారు. సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు ప్రశాంతంగా తమ సమస్యను వివరించేందుకు పోలీసు సిబ్బంది సహాయం చేశారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5.15 లక్షల ఎక్స్‌గ్రేషియా



హోంగార్డు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందిస్తున్న ఎస్పీ

జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్.రఘువర్మ కుటుంబానికి ఎస్పీ రూ.5.15 లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. హోంగార్డు రఘువర్మ సతీమణి కె.విజయమేరికి ఎస్పీ ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు. ఈ సందర్భంగా హోంగార్డు కుటుంబ యోగక్షేమాల గురించి ఎస్పీ ఆరాతీశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రమణయ్య, ఆర్ఐ శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈవోగా సుబ్రమణ్యం బాధ్యతలు



డిప్యూటీ సీఈవోకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏపీపీఆర్ఎంఈఏ నాయకులు

కడప రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి(డిప్యూటీ సీఈవో)గా సి.సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ నిర్వహించిన బదిలీల్లో జమ్మలమడుగు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఈయనకు కడప డిప్యూటీ సీఈవోగా పదోన్నతి కల్పించారు. అలాగే ఇక్కడ జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న మైథిలీని కడప డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. దీంతో ఆమె కూడా సోమవారం కడప డీఎల్‌డీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ నాయకత్వంలో ప్రభుత్వ లక్ష్య సాధనకు తగు చర్యలు చేపడతామన్నారు. అనంతరం పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు డిప్యూటీ సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఈగా శ్రీరామచంద్రమూర్తి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ శాఖ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా శ్రీరామచంద్రమూర్తి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈగా ఉన్న ఈయనకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆయనను కడపకు నియమించారు. జలవనరుల శాఖలో వివిధ కీలక స్థానాల్లో పనిచేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 2021లో ధవళేశ్వరం ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా పనిచేస్తూ శ్రీశైలం ప్రాజెక్టుకు ఎస్ఈగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం కడప ఇరిగేషన్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. కాగా శ్రీరామచంద్రమూర్తికి జలవనరుల శాఖలోని అధికారులు అభినందనలు తెలిపారు.

కూటమిపై ఫీల్ గుడ్

- తల్లికి వందనం ఎప్పుడంటూ వైసీపీ నానా యాగీ
- ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా పథకం అమలు
- జగన్ హయాంలో ఒక్కరికే... ఇప్పుడు ఎంతమందైనా..!
- బక్కన్నగారిపల్లెలో ఐదు మందికి వర్తింపు
- అతిత్వరలోనే అన్నదాత సుఖీభవపై కసరత్తు
- వైసీపీకి మైండ్‌బ్లాంక్... చంద్రబాబు సర్కార్‌కు పొలిటికల్ మైలేజ్



అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్ హామీలను బలంగా జనాల్లోకి తీసుకెళ్లారు. సంక్షేమమే కాదు.. అభివృద్ధి చేస్తామంటూ జనం ముందుకెళ్లి ఓట్లు అడిగారు. జనం కూడా కూటమిపై ఆశలు పెట్టుకున్నారు. వైసీపీకి దిమ్మతిరిగేలా.. కూటమికి ఊహించని విధంగా సీట్లు కట్టబెట్టారు. దీంతో చంద్రబాబు సర్కార్ దూసుకుపోయింది. ఏడాది లోపే దాదాపు పథకాలన్నీ నెరవేర్చి ఆ ప్రభుత్వంపై ఫీల్ గుడ్ సంపాదించుకుంది. అతిత్వరలోనే అన్నదాన సుఖీభవ పథకాన్ని అమలు చేసి వైసీపీకి షాక్ ఇవ్వనున్నారు. ఇది కూటమి సర్కార్‌కు పొలిటికల్ మైలేజ్‌గా పలువురు భావిస్తున్నారు.

కడప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో రాష్ట్రాన్ని బాగు చేస్తామని, హామీలు అమలు చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అధికారం రానే వచ్చింది. వెంటనే ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పింఛన్ల పెంపు, ఉచిత ఇసుకను అమలు చేస్తూ వచ్చారు. అయినప్పటికీ సూపర్‌సిక్స్ పథకాలు ఏవంటూ... తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఎప్పుడంటూ జగన్‌తో సహా వైసీపీ నేతలు ప్రశ్నించేవారు. దీన్ని వైసీపీ సోషల్ మీడియా అలుసుగా తీసుకొని సూపర్‌సిక్స్ పథకాలకు మంగళం పాడినట్లు ప్రచారం చేశారు. వీటన్నిటికి ఫుల్‌స్టాప్ పెడుతూ హామీల అమలుపై కూటమి సర్కార్ దృష్టి పెట్టడంతో వైసీపీ నేతలకు వణుకు పుడుతోంది. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయలేదని వైసీపీ నేతలు భావిస్తూ వచ్చారు. జగన్ ఓ జిల్లా పర్యటనలో నీకు రూ.15 వేలు నీకు రూ.15 వేలు అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు గుర్తు చేస్తూ ర్యాగింగ్ చేస్తే దాన్ని వైసీపీ సోషల్ మీడియా ట్రోల్ చేసింది. జగన్ హయాంలో ఏ పథకానికైనా బటన్ నొక్కుతారు. ఆయన సొంతపత్రికకు ఫుల్ పేజీ యాడ్, బటన్ నొక్కే కార్యక్రమానికి జగన్ హాజరైతే జిల్లాలో జరిగే కార్యక్రమానికి జనసమీకరణ చేసేవారు. అదేదో జగన్ సొంత జేబులో నుంచి తీసి ఇచ్చినట్లు జగన్‌తో సహా వైసీపీ నేతలు ప్రచారం చేశారు. అయితే తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా అమలు చేశారు. జగన్ హయాంలో ఒక్కరికి మాత్రమే పథకం అమలు చేస్తే, చంద్రబాబు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింపు చేశారు. దీంతో తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులు భారీగా జమఅయ్యాయి. జిల్లాలో ఎంతోమందికి రూ.26 వేలు, రూ.39 వేలు, రూ.60వేలు డబ్బులు జమ అయ్యాయి. ఇప్పుడు జిల్లాలో 2,41,119 మంది విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా రూ.361,67,85,000 జమ అయ్యాయి. ఇదే జగన్ హయాంలో 2023లో రూ.270.30 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. పార్టీ అధికారంలో ఉండగా మరో అవకాశం ఇచ్చారు. ఇంకా 1వ తరగతి ప్రవేశం, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన వారికి అమలు చేశారు. గడువు ఇవ్వడంతో పెరిగే అవకాశం ఉంది.

వాట్ ఈజ్ దిస్ చంద్రబాబు

సంక్షేమ పథకాలకు తామే పేటెంట్ అని వైసీపీ బలంగా చెప్పుకొనేది. సోషల్ మీడియాలోనూ ట్రోల్ చేసేవారు. చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయరని భావించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ చేశారు. పింఛన్లను అమాంతంగా పెంచే సరికి వృద్ధులు, దివ్యాంగులు, ఇతర వ్యాధిగ్రస్తులు చంద్రబాబు మేలు చేశారు. వీళ్లంతా వచ్చే ఎన్నికల నాటికి ఓటేసేందుకు ఉండరని వైసీపీ నేతల్లో చర్చ ఉంది. ఉచిత ఇసుక.. ఇది ఇళ్లు కట్టిన వారికే పనికొస్తుందని వైసీపీ నేతల ధీమా. ఇక డీఎస్సీ చదువుకున్నోళ్లకే పరిమితం. అందులోనూ టీచర్లకు ఎంత మేలు చేసినా ఒకసారి ఓటు వేసిన వారికి మరొకసారి వేయరనేది ప్రచారం ఉంది. అన్నక్యాంటీన్‌కు ఎవరు వస్తారు.. ఎవరు తింటారు.. దాని గురించి పెద్దగా పట్టించుకోరని అనుకున్నారు. అందుకే సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల గురించి వైసీపీ టోన్ పెంచింది. ఈ పథకాల అమలుపై వైసీపీ నేతల కౌంటర్లకు టీడీపీ శ్రేణులు కూడా కౌంటర్ ఇచ్చేది. తల్లికి వందనం పథకం అమలు చేసి తల్లుల ఖాతాల్లో భారీఎత్తున నిధులు జమకావడంతో పేదల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ చేసిన ట్రోలింగ్ ఇప్పుడు టీడీపీకి ప్లస్‌గా మారిపోయింది. జనాల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. అన్నదాత సుఖీభవ కూడా అమలుకానుంది. ఈ నెల 20న ఖాతాలో వేస్తామని చెబుతోంది. దీనికి కూడా సుమారు రూ.1.50 లక్షల మంది రైతులు అర్హత ఉన్నట్లు చెబుతున్నారు. చంద్రబాబు హయాంలో తయారైన ఈ పథకం నుంచి రైతులకు అమలు చేశారు. అయితే ఇప్పుడు కొందరి పేర్లు అనర్హత జాబితాలో చూపడంతో రైతుల్లో ఆందోళన రేపుతోంది.

హామీలను నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్. శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎంతమంది బిడ్డలు ఉన్నా వారందరికీ తల్లికి వందనం పథకం అందజేయడం అభినందనీయమన్నారు. సోమవారం కడప నగరం ద్వారకానగర్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఆర్థిక నష్టాల్లో ఉన్నా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో ఒక్క విద్యార్థికే ఆర్థికసాయం అందించగా, కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమందికి పథకాన్ని అమలు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. మంత్రి నారా లోకేశ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక్కరోజే రాష్ట్రంలోని 67.27 లక్షల మందికి తల్లికి వందనం పథకం ద్వారా రూ.8,750 కోట్లు తల్లుల ఖాతాలకు జమచేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 42 లక్షల మది విద్యార్థులకు పథకం అమలు చేయగా, తమ ప్రభుత్వం 67 లక్షల మంది తల్లుల ఖాతాలకు నగదు జమచేసిందన్నారు. రూ.4 వేల పింఛన్‌తో మొదలైన సూపర్‌సిక్స్ పథకాల పరంపర కొనసాగుతోందన్నారు. చేసిన సంక్షేమాన్ని చెప్పుకొనేందుకు ఈ నెల 23 నుంచి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టి ప్రజల ఆశీస్సులు కోరుతామన్నారు. ప్రతిపక్షాన్ని ప్రజలు ఛీకొట్టే పరిస్థితికి తీసుకువస్తామని వివరించారు.

రూ.55 లక్షలు స్వాహా

- మైదుకూరు డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ శ్రీకాంత్



ఏడీ శ్రీకాంత్‌కు అర్జీలు ఇస్తున్న రైతులు

చాపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ శాఖ ఏఈ సాయి ప్రసాద్ సుమారు రూ.55 లక్షలు స్వాహా చేసినట్లు మైదుకూరు డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ శ్రీకాంత్ చెప్పారు. చాపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం రైతుల కోసం ప్రత్యేకంగా ప్రజావేదిక నిర్వహించారు. ప్రభుత్వం సాయిప్రసాద్‌ను మూడు నెలల క్రితం సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఏఈ చేసిన అవినీతిపై అధికారులు ప్రజావేదికలో రైతులతో చర్చించారు. లక్ష్మీపేట, చాపాడు, వెదురూరు, పల్లవోలు, అన్నవరం, విశ్వనాథపురం, సోమాపురం, మరికొన్ని గ్రామాలకు చెందిన 70 మంది రైతులు సాయి ప్రసాద్ తమ వద్ద లంచం రూపంలో డబ్బులు వసూలు చేసినట్లు వారు ఫిర్యాదులో ఆరోపించారు. పల్లవోలు గ్రామం వద్ద వేస్తున్న ఇళ్లస్థలాల వెంచర్ల కోసం యజమాని బొగ్గుల వినోద్‌కుమార్ వద్ద నుంచి సుమారు రూ.25 లక్షలు ఏఈ తీసుకున్నట్లు ఆరోపించారు. కాగా ఈ డబ్బులు ప్రభుత్వానికి పద్దులు రూపంలో చెల్లించాల్సి ఉందని, కానీ ఆయన అలా చెల్లించకపోగా, వినోద్‌కుమార్‌రెడ్డికి రశీదులు ఇవ్వలేదని ఏడీ తెలిపారు. రైతులు చేసిన ఫిర్యాదులన్నింటిని మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ జరిపి పై అధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



7

ఇత్తడి పరిశ్రమను ఆదుకుంటాం : కలెక్టర్

7

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైతు మృతి

- తండ్రిని కోల్పోయిన చిన్నారులు



మృతిచెందిన రాంబాబు



తండ్రిని కోల్పోయిన చిన్నారులు

దువ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నకు నీటితడులు అందించాలని వెళ్లిన ఓ రైతు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతిచెందిన విషాదకర సంఘటన ఐబోయనపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని ఐబోయనపల్లె గ్రామానికి చెందిన బొందల రాంబాబు (36) తనకున్న రెండున్నర ఎకరంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట మొక్కజొన్నను విత్తాడు. నీటి తడులు ఇచ్చేందుకు సోమవారం ఉదయాన్నే పొలం దగ్గరకు వెళ్లి బోరు నీరు అందించేందుకు మోటారు వద్దకు వెళ్లి హ్యాండిల్ పట్టుకోగా విద్యుదాఘాతానికి లోనయ్యాడు. వెంటనే పరిసర పొలాల్లోని రైతులు గమనించి చాగలమర్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృత్యువాత పడినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలిసిన ఆయన భార్య రాధా, కుమారులు అభిరామ్ (8), రామహర్షిత్(6)లు బోరున విలపించారు. మమ్మల్ని అనాథలను చేసి వెళ్లావా.. అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటి యజమాని కోల్పోవడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

ఈ హెచ్‌ఎం మాకొద్దు

- చిలేకాంపల్లె జడ్పీహైస్కూల్‌కు తాళాలు



పాఠశాల గేటుకు తాళాలు వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

చక్రాయపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాకొద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల గేటుకు తాళాలు వేసి నిరసన తెలిపిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే... చిలేకాంపల్లె జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడుగా పిట్ట రమణ ఒకటిన్నర సంవత్సరం కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. మొదటి నుంచి ఈయన తీరు వివాదాస్పదంగానే ఉందని పలువురు చెబుతున్నారు. విద్యాబోధన పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నాడు నేడు పనుల్లో భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాకుండా కొంతకాలంగా ఇక్కడే పనిచేస్తున్న ధర్మారెడ్డికి, హెచ్‌ఎం రమణకు మధ్య కోల్డ్‌వార్ ఉండడంతో బోధన పట్టించుకోకుండా వదిలేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తద్వారా విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతూ వచ్చిందని వారు చెబుతు న్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు.. ఈ హెచ్‌ఎం మాకొద్దు బాబోయ్.. మా పిల్లల టీసీలు ఇవ్వండి అంటూ పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చే స్తున్నారు. ఇదిలా ఉండగా ఈ మధ్య జరిగిన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌లో భాగంగా ధర్మా రెడ్డి నాగిరెడ్డిపల్లె పాఠశాలకు బదిలీపై వెళ్లారు.

పిల్లల టీసీలు తీసుకెళ్తున్నాం

చిలేకాంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న పిట్ట రమణ కారణంగానే మేము పిల్లల టీసీలు తీసుకెళ్లేందుకు వచ్చాం. ఆయన విద్యాబోధన అస్సలు పట్టించుకోడు. మొదటి నుంచి అతని తీరు వివాదాస్పదమే. ఇటువంటి పాఠశాలలో ఉంటే పిల్లల భవిష్యత్ ఏమవుతుంది. అందుకే నా కుమారుడి టీసీ తీసుకెళ్లేందుకు వచ్చాను.

- పోగుల శివనారాయణ, విద్యార్థి తండ్రి



ఉపాధ్యాయుడు రమణ ఏమన్నారంటే..

ఇదంతా రాజకీయ కుట్రలో భాగమని, తనకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేసి నంత మాత్రాన తాను ఎందుకు ట్రాన్స్‌ఫర్ అవుతాను. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యల పరిష్కారానికి సంబంధించిన అర్జీలను కలెక్టర్, జేసీ, అధికారులకు అందజేశారు. అర్జీలు స్వీకరించిన మీదట వారి సాధక, బాధలు తెలుసుకుంటూ సంబంధితశాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా పరిష్కారం ఉండాలన్నారు. ఈ సందర్భంగా కడప నగరానికి చెందిన పిచ్చమ్మ తన ఇళ్లను తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని, దౌర్జన్యంగా కూల్చివేశారని, సీఐ, ఎస్ఐల ప్రమేయం ఉందని వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. జమ్మలమడుగుకు చెందిన గుర్రప్ప ఫిర్యాదు చేస్తూ.. తనకు సర్వే నెంబరు 158లో భూమిని సర్వే చేయాలని ఏడేళ్లుగా తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని తెలిపారు. ఒంటిమిట్ట మండలానికి చెందిన వెంకట సుబ్బమ్మ తాను నిరుపేదనని, తన పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు, అధికారులు సరస్వతి, రాజ్యలక్ష్మీ, కిరణ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ నాలుగు సబ్‌స్టేషన్లకూ..

శంకుస్థాపనతోనే సరి!

- ప్రారంభం కాని పనులు
- వెనక్కు మళ్లిన నిధులు
- దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలు
- ఆవిరైన రైతుల ఆశలు
- తాజాగా రెండింటికి అనుమతులు



గట్టు పంచాయతీ కొత్తపల్లె వద్ద సబ్‌స్టేషన్ కోసం ఎమ్మెల్యే వేసిన శిలాఫలకం దుస్థితి



పెద్ద తిప్పసముద్రం మండలం బొంతలవారిపల్లె వద్ద దిష్టిబొమ్మలా మారిన శిలాఫలకం

బి.కొత్తకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న న్నాళ్లు చేయకుండా.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గానికి ఆరు 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించారు. బి.కొత్తకోట మండలంలోని గట్టు పంచాయతీ కొత్తపల్లె, నగరపంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి, పీటీఎం మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారి పల్లి, టీ.సదుం పంచాయతీ రామాపురం, ములకలచెరువు మండలంలోని మద్దినాయునిపల్లె, పాతకోట గ్రామాల్లో 2024 మార్చి 18న శిలాఫలకాలు వేశారు. ఇకపై తమకు లో ఓల్టేజీ సమస్య ఉండదని మోటార్లు బాగా నడుస్తాయని ఆయా ప్రాంతాల రైతులు భావించారు. అయితే అది కార్య రూపం దాల్చకపోవడంతో, ఆయా ప్రాంతాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

నిధులు వాపసు

మూడు మండలాల్లో 6 విద్యుత్ సబ్‌స్టేషన్లకు గాను, ఒక్కో దానికి రూ.1.83 కోట్లు చొప్పున సుమారు రూ.10.80 కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయి. నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి అయింది. నిర్మాణ పనులను కేఎస్‌ఆర్ ఏజెన్సీస్ అనే కంపెనీ దక్కించుకుంది. ఆరు చోట్ల సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు స్థలాలను కేటాయించారు. అయినా నిర్మాణాలు ప్రారంభించలేదు. అదిగో.. ఇదిగో అంటుండగానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. వైసీపీ ప్రభుత్వమూ పోయింది. నిధులు పక్కదారి పట్టేశాయి.

ఆ..నాలుగూ లేనట్టేనా?

శంకుస్థాపన చేసిన ఆరింటిలో నాలుగు సబ్‌స్టేషన్ల ఏర్పాటు లేనట్టేనని తెలుస్తోంది. మంజూరైన నిధులు వెనక్కి వెళ్లగా , కూటమి ప్రభుత్వంలో తాజాగా పంపిన ప్రతిపాదనల మేరకు ములకలచెరువు మండలంలోని సోం పల్లి, పీటీఎం మండలంలోని రామాపురం గ్రామాలకు మాత్రమే 33 కేవీ సబ్‌స్టేషన్లు మం జూరయ్యాయి. త్వరలో ని ర్మాణం ప్రారంభం కానుంది. బి.కొత్తకోట మండల పరిధిలోని కొత్తపల్లి, శెట్టిపల్లి, పీటీఎం మండలంలోని బొంతలవారిపల్లి, ములకలచెరువు మం డలంలోని మద్దినాయునిపల్లెలకు రిక్తహస్తమేనని అధికారులు చెబుతున్నారు. వైసీపీ హయాంలో నాయకులు ఐదేళ్లు పట్టించుకోకుండా తీరా చివరి నిమిషంలో హడావుడి చేసి, నిర్మాణాలపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. నిర్మాణాలు పూర్తయి ఉంటే ఆరు సబ్‌స్టేషన్ల పరిధిలో సుమారు 40 గ్రామాల రైతులకు లాభం చేకూరేది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

> లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం 33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించామని, టెండర్లు కూడా పూర్తి అయ్యాయని, రెండునెలల్లో నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామంటూ అధికారాంతంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రకటించారు. ట్రాన్స్‌కో సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో అట్టహాసంగా శంకుస్థాపన కూడా చేశారు. అయితే, సబ్‌స్టేషన్‌ల ప్రారంభోత్సవం సంగతి అటుంచి నిర్మాణానికి ఇటుక కూడా పడలేదు. ఆ నిధులూ వెనక్కు మళ్లాయి.

రెండు మాత్రమే మంజూరు

ఎన్నికలకు ముందు అనుకున్న 6 సబ్‌స్టేషన్ల కథ ముగిసింది. ఆ నిధులు కూడా అప్పుడే వెనక్కు వెళ్లాయి. ఇప్పుడు మళ్లీ ప్రతిపాదనలు పంపగా సోంపల్లి, రామాపురం లకు నూతన సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం అవుతాయి.

-గంగాధర్, డీఈఈ, ట్రాన్స్‌కో

ప్రతి ఉద్యోగీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఎం జానకీరామ్

పీలేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) జానకీరామ్ పిలుపునిచ్చారు. ఏపీ ట్రాన్స్‌కో పీలేరు డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందికి సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటుపై సోమవారం పీలేరులో ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేల రాయితీని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. వినియోగదారులు తమ వంతు వాటాగా 15 శాతం భరిస్తే మిగిలిన మొత్తం బ్యాంకు రుణంగా పొందవచ్చునన్నారు. ఈ రాయితీలను సద్వినియోగం చేసుకుని ట్రాన్స్‌కో ఉద్యోగులు తమ ఇళ్లపై రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు దాదాపు 70 శాతం తగ్గుతాయన్న సత్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర రెడ్డి, జిల్లా టెక్నికల్ డీఈ ఈశ్వర రెడ్డి, పీలేరు ఏడీఈలు అమీర్, శివయ్య, ఏఈలు ఇలాహి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయాలి

పీలేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న తిరుపతిలో జరగనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని బీసీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆత్మగౌరవ భరోసా సభ సన్నాహకాల్లో భాగంగా వారు సోమవారం పీలేరులోని పలువురు బీసీ నేతలు, బీసీ సంఘాలను కలిసి ప్రచార వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేస్తున్నామని, 56 కార్పొరేషన్ పదవులు ఇచ్చామని గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వంలో బీసీలకు ప్రయోజనం శూన్యమన్నారు. కేవలం పేపర్ మీద కార్పొరేషన్లు సృష్టించి నిధులు, విధులు ఇవ్వకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయన్నారు. బీసీలను పట్టించుకోని పాపానికి వైసీపీ తగిన మూల్యం చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు తగిన ప్రాధాన్యం లభిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడంతో పాటు వాటి పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకులను సత్కరించుకోవడం కోసం ఆత్మగౌరవ భరోసా సభ ఏర్పాటు చేశామన్నారు.ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్-పూలే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని ఇందిరా మైదానంలో 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే సభలో అన్నమయ్య జిల్లాలోని బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ నాయకుడు ఆల్‌మెన్ రాజు, పాల ఏకిరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మురళీ, జిల్లా బీసీ అధ్యక్షుడు నాగరాజు, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు యాదగిరి, పీలేరు నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు రామస్వామి, వడ్డెర రమణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



వంశీకృష్ణ

బి.కొత్తకోట, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): క్షణికావేశంలో ఆ యువకుడు తీసుకున్న నిర్ణయం తల్లితండ్రులకు జీవిత కాల శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బడికాయల పల్లెకు చెందిన కాలన్నగారి మల్లికార్జున కుమారుడు వంశీకృష్ణ (18) తిరుపతిలోని ఓ ప్రైవేటు కాలేజిలో ఇంటర్ పూర్తి చేశాడు. చెన్నైలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్ తీసు కున్నాడు. ప్రస్తుతం బి.కొత్తకోటలో కంప్యూటర్ శిక్షణకు వెళు తున్నాడు. వ్యవసాయ పనులలో తండ్రికి చేదోడుగా ఉండే వాడు. సోమవారం కుటుంబ సభ్యులతో టమోటా కోతకు వెళ్లి మధ్యాహ్నం దాకా బాక్సులను మోశాడు. అనంతరం కంప్యూ టర్ క్లాస్‌కు వెళ్లాలంటూ ఇంటికి వ చ్చాడు. తలుపునకు గడియపెట్టుకొని ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. ఇంటికి వచ్చిన తండ్రి లోపలినుంచి గడియ పెట్టి ఉండటంతో ఇతరుల సాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా కొడుకు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. తన బిడ్డను ఆ స్థితిలో చూసిన కుటుంబీకులు విలపించారు. సమా చారంతో మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించా రు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. వంశీ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు పరార్, ఒకరికి రిమాండ్



ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన వ్యక్తితో అటవీ అధికారులు

ఓబులవారిపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓబులవారి పల్లె మండల పరిధిలోని కేవీ బావి పరిధిలో 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. జూలై 14, 15 తేదీల్లో కేవీ బావి నార్త్ బీట్ పరిధిలో చైలిమిగుట్టల్లో కూంబింగ్ నిర్వహించగా, వృక్షాలు నరుకుతున్న ముగ్గురిని గుర్తించామని, వారిలో ఇద్దరు పరార్ కాగా ఒకరు పట్టుబడ్డారన్నారు. వారి నుంచి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, వీటి బరువు 231 కేజీలు ఉండగా విలువ సుమారు రూ.1.13 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన వైకోట గ్రామానికి చెందిన కంభం వేములయ్యను కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు పంపించారన్నారు. పరారీలో ఉన్న వై.కోట గ్రామానికి చెందిన చావకుల సుబ్రమణ్యం, కొండేటి సుబ్రమణ్యం కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహేశ్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు జనార్దన్, నాగేశ్వర్‌నాయక్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కలకడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి):పురుగులమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు హెచ్‌సీ ముజీబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ తూర్పువడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ గొర్రెలు మేపుకొంటుండగా, అతని భార్య చిన్నమ్మి(62) కూలి పనులు చేసేది. ప్రతి రోజు ఉదయాన్నే పనులకు వెళ్లాల్సి వస్తుండడంతో వంట చేయడం లేదని భర్త మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన చిన్నమ్మి ఈ నెల 13 న పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్సపొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్, బీఎంపీపీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం బీఎంపీపీ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో రామ సముద్రం మండలం ఏటవాకిలి రోడ్డులో తనిఖీలు చేస్తుండగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బి.మునస్వామి గౌడ(64) పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 42 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని, స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

ములకలచెరువు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు...స్థానిక ఉమాశంకర్‌రెడ్డి కాలనీకి చెందిన రాళ్లపల్లి రెడ్డి ముబారక్(24) రోడ్డు దాటుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రూయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

- అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నా రు. ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, అత్తారింటి వేధింపులు, భూవివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు విన్నవించుకోగా వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యల నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు వారి పరిధిలోని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆయన సూచించారు.

‘జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి’

- రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్

రాయచోటి టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాతోపాటు రాయచోటి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. రాయచోటిలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాటాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు జిల్లా అభివృద్ధి శూన్యమన్నారు. నాటి పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో రాయచోటి నియోజకవర్గం మీదుగా వెళ్లే కడప-బెంగళూరు రైల్వే లైను అలైన్‌మెంట్ మార్చారన్నారు. ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏమీ సాధించలేకపోయారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తద్వారా గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్న యువతకు స్థానికంగానే ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజులు మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలోని రైతాంగానికి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీరు అందించాలన్నారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో టమోటా ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేస్తే రైతులను ఆదుకున్నట్లు అవుతుందన్నారు. అంబేడ్కర్ సేన నాయకులు పల్లం తాతయ్య మాట్లాడుతూ హంద్రీ-నీవాకు అంతర్భాగమైన వెలిగట్లు, శ్రీనివాసపురం ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రి సుమిత్ర, ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకులు అస్లం, సహారా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కల వెంకటేశ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వడ్లమూడి హరినాథనాయుడు, అహ్మద్ అలీఖాన్, సురేంద్ర, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

బలిజ రిజర్వేషన్ పోరాట యాత్రకు ఘనస్వాగతం



నానా ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న తోట వెంకట్ తదితరులు

రాజంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బలిజలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఒంగోలు కాపు యువనేత నాసా ప్రసాద్ తిరుపతి జిల్లా కాళహస్తికి చెందిన కేటీటీ రాఘవయ్య తదితరులు చిత్తూరు నుంచి సాగిస్తున్న పాదయాత్ర సోమవారం రాజంపేటకు చేరుకుంది. రాజంపేటకు చెందిన బలిజ యువనేత తోట వెంకట్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఉద్యమ నేతలకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాసా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం బలిజలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. చిత్తూరు నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర నెల్లూరు, వెంకటగిరి, రాపూరు, చిట్వేలి మీదుగా అన్నమయ్య జిల్లా రాజంపేటకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో కాపులు, బలిజలు, తెలగలు 50 శాతం ఉన్నారని, గతంలో తమకు కేటాయించిన రిజర్వేషన్లు వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమ పాదయాత్ర అమరావతికి చేరుకుని అక్కడ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇస్తామన్నారు. రిజర్వేషన్లు పునరుద్ధరించే వరకు తమ ఉద్యమాన్ని ఆపమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం నేత చిట్వేలికి చెందిన మస్తాన్‌రాయల్, రాజంపేట యువ నేత తోట వెంకట్, ఊటుకూరు యువనేత నామా నరసింహ, జవ్వాజి సాయి, కుసులూరు హరికృష్ణ, ఆనందాల సన్ని, రమేష్ పాల్గొన్నారు.

ధరాపాతం..!

- వేసవిలోనే వర్షాలు..
- ఊజీ ఈగతో నాణ్యత తగ్గిన కాయలు
- నష్టాల్లో మామిడి రైతులు



తోటలోనే వదిలేసిన మామిడి కాయలు

పెద్దమండ్యం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి పూర్తి కాకుండానే వర్షాలు కురవడంతో మామిడి కాయల్లో నాణ్యత లోపించింది. పండుఈగ ఆశించడంతో కాయలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. దీనికి తోడు ఎగుమతులు లేకపోవడంతో ధర పడిపోవడం గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.

తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దమండ్యం మండలంలో 600 హెక్టార్లు, బి కొత్తకోట మండలంలో 110, ములకలచెరువు మండలంలో 100, తంబళ్లపల్లి మండలంలో 120, కురబలకోట మండలంలో 112 హెక్టార్లల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఏడాది రైతులు ఆశించిన స్థాయిలోనే దిగుబడులు వచ్చాయి. కానీ, హఠాత్తుగా వర్షాలు కురవడంతో ఊజీ ఈగ సోకి నాణ్యత దెబ్బతినింది. దీంతో ధర 50 నుంచి 60 శాతం పతనమైందని రైతులు వాపోతున్నారు. వర్షం రాక ముందు బేనీషా రకం మామిడి టన్ను రూ. 40 వేలు, ఇమాంపసంద్ రూ.85 వేలు, ఖాదర్ రూ.40 వేలు ఉండగా, ప్రస్తుతం సగానికి సగం పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. జ్యూస్‌కు వాడే మామిడి రకాలు టన్ను రూ. 6 వేలు నుంచి 8 వేల పలుకుతున్నాయి. ఈ రకం కాయల కొనుగోలుకు ప్రభుత్వం అను మతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరలు భారీగా పడిపోవడంతో పలువురు రైతులు మామిడి కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేసినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వర్షంతో నష్టపోయాం

వేసవి పూర్తికాకుండానే వర్షం కురవడంతో ఊజీ ఈగ పడి మామిడి కాయల్లో నాణ్యత లోపించింది. ధర కూడా బాగా తగ్గిపోయింది. ఏప్రిల్ నెలలో పలికిన ధరల్లో సగం కూడా ప్రస్తుతం లేదు. దీంతో తీవ్రంగా నష్టం వచ్చింది.

- సుదర్శన్‌రెడ్డి, రైతు, గురివిరెడ్డిగారిపల్లి

వ్యాపారం బాగా తగ్గింది

మామిడి కాయలు మార్కెట్‌కు రాకపోవడంతో వ్యాపారం బాగా తగ్గింది. నాణ్యత లేకపోవడంతో ఎగుమతులు కూడా లేవు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 45 శాతం కూడా వ్యాపారం కాలేదు. పల్లెకు వెళ్లినా నాణ్యమైన మామిడి కాయలు దొరకడంలేదు.

- మైనుద్దీన్, వ్యాపారి, మదనపల్లి

డీపీఆర్వో పురుషోత్తం సేవలు మరువలేనివి



డీపీఆర్వో పురుషోత్తంను సత్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి (కలెక్టరేట్) జూన్ 16: డీపీఆర్‌ఓ పురుషోత్తం నంద్యాల జిల్లాకు బదిలీపై వెళుతుండడంతో సోమవారం సాయంత్రం కలెక్టర్ ఆయనను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీపీఆర్వో పురుషోత్తం సేవలు మరువలేనివని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రభుత్వం చేసే కార్యక్రమాలను పత్రికల ద్వారా ప్రజలకు అందించే విధానంలో ఆయన శైలి అద్భుతంగా ఉంటుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నదియాదేవి, డీఆర్‌ఓ మధుసూధన్‌రావు, సమాచార శాఖ సిబ్బంది,మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు పట్టిన బియ్యంతో పిల్లలకు భోజనం

కలకడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కలకడ ఆదర్శ పాఠశాల్లో పురుగుపట్టిన బియ్యంతో భోజనం వండుతున్నారని ఆ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యాన్ని సరఫరా చేస్తుంటే అందుకు భిన్నంగా మూడు నెలల క్రితం సరఫరా చేసిన బియ్యంతో అన్నం చేసి వడ్డిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మలాం షావలి దృష్టికి తీసుకెళ్లగా ముందు సరఫరా చేసిన బియ్యం అయిపోగానే కొత్త బియ్యాన్ని వాడాలని సూచించినట్లు తెలిపారు. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కొందరు చూస్తున్నారని తెలిపారు.

‘ఈ తహసీల్దారు మాకొద్దు’

తంబళ్లపల్లె, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక పేదలకు చెందాల్సిన భూములను పక్క జిల్లాకు చెందిన అగ్రకుల భూస్వాములకు దోచి పెట్టిన తహసీల్దారు శ్రీనివాసులు తమకొద్దని, వెంటనే బదిలీ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అంజినప్ప డిమాండ్ చేశారు. సోమవారం తంబళ్లపల్లె తహసీల్దారుగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించడంతో భారత కమ్యూనిస్టు పార్టీ, సీపీఐ, రైతు సంఘాల నాయకులు ఈ అవినీతి తహసీల్దారు మాకొద్దని నినాదాలు చేస్తూ రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ములకలచెరువు తహసీల్దారుగా శ్రీనివాసులు పనిచేస్తున్నపుడు గూడుపల్లె గ్రామంలోని స్త్రోత్రియం భూములను పక్క జిల్లాకు చెందిన అగ్రకుల భూ స్వాములకు దోచిపెట్టి పేదలకు అన్యాయం చేశాడన్నారు. గతంలో తహసీల్దారు చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు తంబయ్యశెట్టి, నిజాముద్దీన్, సుబ్బన్న, రమణప్ప, ఉత్తన్న, రెడ్డప్ప, నరసింహులు, అమరావతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘తల్లికి వందనం’



వినతులు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అర్హులందరికీ తల్లికి వందనం వర్తించేలా చూస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించి తల్లికి వందనం కింద నగదు జమకాని అర్హుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5వ తేదీలోగా నగదు జమకాని అర్హులు సంబంధిత పత్రాలను సచివాలయాల్లో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ నరసింహారెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం అందని వారికోసం దరఖాస్తు ఫారం



గ్రామ - వార్డు సచివాలయము

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

కలికిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో తల్లికి వందనం నిధులు మంజూరు కాకుండా అనర్హుల జాబితాలో చేరిన వారు సవరణలు చేసుకునేందుకు అవసరమైన దరఖాస్తు ఫారంను ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో అన్ని వివరాలను నమోదు చేసి ఆయా సచివాలయాల్లో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను సచివాలయాల్లో అందజేయాలని కోరారు. పూర్తి స్థాయి పరిశీలన అనంతరం అర్హులుగా తేలిన వారందరికీ జూలై 5 న ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం ఉన్నవారు, సరైన ఆదాయ ధ్రువీకరణపత్రం లేకపోవడం, 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం, కుటుంబంలో రూ.12000లకు మించి జీతం పొందుతున్న వారు, 10 ఎకరాలకన్నా అధికంగా మెట్ట భూమి ఉన్నవారు, కుటుంబంలో ఆదాయ పన్ను చెల్లిస్తున్న సభ్యులుండటం అనర్హతకు కారణాలని చెబుతున్నారు. వీటన్నిటికీ తగిన ఆధారాలతో తిరస్కరిస్తూ తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పథకాన్ని వర్తింపజేస్తారని చెబుతున్నారు.

కౌలు రైతుల కష్టాలు తీరేనా..

- కౌలు కార్డుల జారీలో నిర్లక్ష్యం
- పంట రుణాలు అందక అగచాట్లు
- విత్తన రాయితీలు పొందలేక...
- ప్రభుత్వ స్పందన కోసం ఎదురు చూపులు

కమలాపురం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఏడాదంతా కష్టపడి వ్యవసాయం చేసినా కౌలు రైతులకు ప్రతి ఫలం దక్కడం లేదు. కౌలు సహా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇంత వెచ్చించినా ప్రకృతి విపత్తులతో పంట చేతికి రాని సందర్భాలే ఎక్కువ. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం జారీ చేస్తున్న సీసీఆర్ కార్డులు కార్డులు అందక అవస్థలు పడుతున్నారు.

ఖరీఫ్ సీజను ప్రారంభమైంది. దుక్కులు దున్నడం, పొలాలకు పశువుల ఎరువు తరలించడం, పంట వ్యర్థాలను శుభ్రం చేసుకోవడం తదితర పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం వస్తే పంటలు సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు కౌలుకార్డుల ఆధారంగా పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలను రాయితీపై అందిస్తారు. పంట రుణాలకు కార్డులు తప్పనిసరి. ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్నందున కౌలుకార్డుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వారికి ఎల్ఈసీ ఇవ్వాలి. ఇందుకు మే నెలలో ప్రక్రియ ప్రారంభించి జూన్ నెల మొదటి వారానికి కార్డులు అందజేయాల్సి ఉంటుంది.

మొదలు కాని కౌలుకార్డుల జారీ

పెట్టుబడి సాయం, పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి నష్టపరిహారం లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట రుణం ఇలా ఏది వర్తించాలన్నా సీసీఆర్ కార్డు ఉండాలి. ఈ కార్డు ఉంటేనే కౌలు రైతులకు అర్హత ఉంటుంది. అయితే కౌలుదారులకు కీలకమైన కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఇప్పటికీ కాలేదు. మరోవైపు వ్యవసాయ అధికారులు పంటల విత్తనాల పంపిణీ ప్రారంభించడంతో కౌలుదారులు ఆందోళన చెందుతున్నారు. 50శాతం రాయితీ

> **కౌలు రైతుల ఎంపిక ప్రారంభించాం**
>
> కమలాపురం వ్యవసాయ డివిజను పరిధిలో ఐదు మండలాలు ఉన్నాయి. ఇందులో 1124 మంది కౌలు రైతుల ఎంపిక ప్రారంభించామని వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. కమలాపురం వ్యవసాయ డివిజను పరిధిలో కమలాపురం మండలం 255 మంది, వల్లూరు మండలం 170 మంది, వీఎన్‌పల్లె మండలం 193 మంది, ఎర్రగుంట్ల మండలం 506 మంది కౌలు రైతుల ఎంపిక చేపట్టామన్నారు. వీరికి కౌలు కార్డులు తహసీల్దారు జారీ చేస్తారు.
>
> - నరసింహారెడ్డి, ఏడీఏ, కమలాపురం



అన్నదాత సుఖీభవ కోసం ఈకేవైసీ చేసుకుంటున్న రైతులు

అందిస్తూ పచ్చిరొట్ట విత్తనాలు కార్డులు లేనిదే అందుకోవడానికి సాధ్యంకాదు. సొంత పొలం సాగుచేసుకుంటూ మరికొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేసేవారు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారు. మొత్తం పంట రుణాల్లో కౌలు రైతులు పది శాతం ఇవ్వాల్సిందేనని జిల్లా యంత్రాంగం బ్యాంకర్లకు ఆదేశిస్తున్నా ఆచరణలో అమలు కావడంలేదు.కౌలు రైతుల కష్టాలపై కూటమి ప్రభుత్వం అయినా స్పందిస్తుందని ఎదురు చూస్తున్నారు.

ఆలస్యం అయితే రాయితీ రాదు

కార్డుల జారీ ఆలస్యమయితే రాయితీ విత్తనాలుతో పాటు ఇతర పథకాలు రావని కౌలు రైతులు చెబుతున్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే కౌలుకార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జూన్ నెలాఖరులోపు కార్డులు జారీ చేసే సాగు ఉత్పాదకాలు కౌలుదారులకు అందేలా చూస్తామని వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిన వైసీపీ, కూటమి ప్రభుత్వాలు : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను వైసీపీ, కూటమి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార పతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత ఉన్నత విద్యనందించాలనే ఉద్దేశ్యంతో 2008లో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యలో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాల ద్వారా కొన్ని లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగంతో ఉన్నత ప్రమాణాలతో జీవిస్తున్నారన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాలకు పేర్లు మార్చి విద్యా దీవెన, వసతి దీవెన అనిపేర్లు పెట్టిందన్నారు. అంతేకాకుండా ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీవిద్యార్థులకు పై రెండు పథకాలు వర్తించవని 2.12.2020న జీఓ 77ను జారీ చేసిందన్నారు. దీని వలన లక్షలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత జీఓ 77ను రద్దు చేయలేదు, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు చెల్లించలేదన్నారు. కోర్సు పూర్తయినప్పటికి విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేని పరి స్థితి ఉందన్నారు. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ఉన్న రూ.4200 కోట్లు, స్కాలర్‌షిప్‌కు ఉన్న రూ.2200 కోట్ల బకాయిలను వెంటనే చెల్లిచాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు గత ప్రభుత్వ నిర్వాకంతో సర్టిఫికెట్ పొందలేని పరిస్థితిలో ఉన్న వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విద్యాలయ విద్యార్థుల సమస్య పరిష్కరించాలని కోరారు. 2020లో గత వైసీపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని స్థాపించి నప్పటికి ఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కి టెక్చర్ నుంచి అనుమతి పొందలేద న్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ఇత్తడి పరిశ్రమను ఆదుకుంటాం : కలెక్టర్



ఇత్తడితో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇత్తడి వస్తువులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, ఇత్తడి పరిశ్రమకు నిధులు మంజూరు చేసి ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. మండలంలోని వనిపెంటలో ఇత్తడి పరిశ్రమను ఆయన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలసి సోమవారం పరిశీలించారు. ఇత్తడి పరిశ్రమ తయారీ చైర్మన్ ఇస్మాయిల్ కార్మికులు తయారు చేసిన వస్తువులను కలెక్టర్, ఎమ్మెల్యేలకు చూపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇత్తడి వస్తువులకు మార్కెట్ లో మంచి గిరాకీ ఉందని, కాని ఇత్తడి పరిశ్రమలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. ఇత్తడి పరిశ్రమతో పాటు, తయారీదారులను కూడా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ఏసీఏ అండర్-19 మెన్ వన్డే క్రికెట్ విజేత కడప

కడప స్పోర్ట్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్ వన్డే అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలలో కడప జట్టు విజేతగా నిలిచింది. పోటీలో కడప జట్టుతో పాటు చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల జట్లు తలపడ్డాయి. ప్రతి జట్టు నాలుగేసి మ్యాచ్‌లు ఆడగా.. కడప జట్టు ఆడిన నాలుగింటిలో విజయం సాధించి 16 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. చిత్తూరు జట్టు మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి 12 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నెల్లూరు, అనంతపురం, కర్నూలు జట్లు ఒకే ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించి 4 పాయింట్లతో మూడో స్థానాలతో సరిపెట్టుకున్నాయి. చివరిగా సోమవారం ఆడిన మ్యాచ్‌ల వివరాలిలా......

8 వికెట్లతేడాతో చిత్తూరు జట్టు విజయం

కేఎస్ఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 21.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ ధనుష్‌రెడ్డి 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 15.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 84 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో పి.వరుణ్ 50 పరుగులు చేశారు.

కడప జట్టు ఘన విజయం

ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగింది. టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 43.4 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం కడప జట్టు కేవలం 15.1 ఓవర్లలో 132 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ వర్మ 90 పరుగులు చేయడం విశేషం. దీంతో కడప జట్టు ఏకంగా 10 వికెట్ల తేడాతో గెలుపొందింది.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి మోసం చేశా రని, ప్రతి ఒక్క హామీ అమలు చేసేందుకు నిరంతరం ప్రజలపక్షాన పోరాడుతామని ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కడప నగరం మేడా కన్వెన్షన్ హాల్‌లో వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెటడమే చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. కూటమి పాలనలో అప్పుతప్ప అభివృద్ధి లేదన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది పాలనలో అప్పు తప్ప పాలన, అభివృద్ధి లేదన్నారు. తల్లికి వందనం పథకంలో భారీగా కోతలు విధించారన్నారు. ఏడాది కూటమి పాలన పూర్తిగా విఫలం చెందిందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలనకాదు అసలు పాలనే లేదని విమర్శించారు. అనంతరం కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపుతూ పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసన సభ్యుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, మాజీ ఎమ్మెల్యేలు రాచ మల్లు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం

కడప మారుతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మిగతా కులాలతో సమానంగా యానాదులు ఎదగాలంటే ఎస్టీ వర్గీకరణతోనే సాధ్యం అవుతుందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి చిన్న పెంచలయ్య అన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన ఎస్టీ వర్గీకరణ అమలయ్యేలా చేయ డంతో పాటు యానాదుల అభివృద్ధికి వీలుగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట యానాది రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడు నీలం సురేంద్ర ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల మంది యానాదులు ఉన్నారని అన్నారు. గిరిజన తెగలో అత్యధిక జనాభా గల యానాదులు అనాధిగా అన్ని రంగాలలో వెనుకబాటుతనంతోనే మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ వలే ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు విద్య, వైద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం జేకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు బ్రహ్మయ్య, అంకమ్మరావు, ఎం.చెంచయ్య, కె.ఎం.మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, శివశంకర్, సుధాకర్, పాటు పలువురు యానాదులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యానాదులు

ఐసీయల్‌పై ఫిర్యాదు... ఆర్డీవో పరిశీలన



రోడ్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నయ్య

ఎర్రగుంట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిలమకూరు ఐసీయల్ కర్మాగారంతో తమకు అనేక సమస్యలున్నాయని చిలమకూరుకు చెందిన ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ విచారణ చేయాలని ఇన్‌చార్జి ఆర్డీవో చిన్నయ్యను ఆదేశించారు. సోమవారం చిలమకూరు ఐసీయల్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించారు. చిలమకూరు ఆర్టీపీపీ రోడ్డులో ఐసీయల్ మైన్స్‌కు భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు గుంతలమయ మైందని, ఐసీయల్ కర్మాగారం భూమి చుట్టూ కంచె వేయక పోవడంతో అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయని, ఐసీ యల్ మైన్స్ వల్ల ఇళ్లు భారీగా దెబ్బతింటున్నాయని తదితర సమ స్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్ పులివెందుల ఆర్డీవో చిన్నయ్యను పరిశీలించి రిపోర్టు పంపాలని ఆదేశించడంతో సోమవారం తహసీల్దార్ శోభన్‌బాబు తదితరులతో కలిసి పరిశీ లించారు. ఇక్కడ సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు.

ఎస్‌బీఐ చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

చెన్నూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐలో ఈ ఏడాది ఏప్రిల్ 13న జరిగిన చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్ విధించినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. చెన్నూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 13న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఎస్‌బీఐ ప్రధాన గేటు తాళం పగలగొట్టి బ్యాంకులో రూ.30వేలు చోరీ చేశారని తెలిపారు. బ్యాంకుకు సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించామని తెలిపారు. వీరిలో కర్ణాటక రాష్ట్రం హుబ్లీ జిల్లాకు చెందిన నాయ కర్‌నగరకు చెందిన బసవ రాజు (28), గలత్‌జిల్లా గజేంద్రఘడ్‌కు చెందిన సంజీవప్ప (29), యల్లప్ప (22) అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. అంతకుముందు వీరు ఖాజీపేటలో చోరీకి పాల్పడటంతో గత నెల 24న ఖాజీపేట పోలీసులు వీరిని అరెస్టు చేశారన్నారు. చెన్నూరులో జరిగిన దొంగతనానికి సంబంధించి ఇదే వ్యక్తులను తాము అదుపులోకి తీసుకుని రిమాండు విధించామన్నారు. ఈ చోరీ ఘటనలో ఆరుగురు ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇప్పటికి ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు.

గండికోటలో యోగా దినోత్సవానికి స్థల పరిశీలన

జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గండికోటలో ఈనెల 18వ తేదీ బుధవారం యోగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితోపాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసుల రెడ్డి తదితరులు స్థల పరిశీలన చేశారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 18వ తేదీ ఉదయం ఏడు గంటలకు జమ్మలమడుగు ప్రాంతం నుంచి విద్యార్థులు, ఇతరులు దాదాపు అయిదు వేల మంది యోగాలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గండికోటలో అభివృద్ధి పనులు, తదితర వాటికి సంబంధించి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని. ప్రతి ఒక్కరు యోగా చేయాలని ఆమె తెలిపారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గండికోటలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జేసీ అదితిసింగ్

వంతెన పనుల పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

వీరబల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లగూర గండి వద్ద, గండికోట కస్పా ప్రాంతంలో మాండవ్యనదిపైన ఏర్పాటు చేసిన వంతెనల పనులను సోమవారం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీరు నయీముల్లా పరిశీలించారు. అధికారులను అడిగి పనుల నాణ్యతను తెలుసుకున్నారు. ఈ వంతెనల నిర్మాణంతో వర్షాలు వచ్చినప్పుడు ప్రజలు పడే కష్టాలు తొలగిపోయాయన్నారు. ఈ వంతెనలు లేని సమయంలో మాండవ్యనది ప్రవహిస్తే అటు వైపు ఉన్న ప్రజల రాకపోకలు జరిగేవి కాదన్నారు. ఈ వంతెనల నిర్మాణంతో ప్రస్తుతం అక్కడి ప్రజలకు కష్టాలు తీరి రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కడప ఎస్ఈ చంద్రశేఖర్, డీఆర్ఈవో సహదేవరెడ్డి, ఏఈలు బ్రహ్మారెడ్డి, కుమార్‌బాబు, కాంట్రాక్టర్లు నాగూర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కడప క్రైమ్ జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సాయిపేటకు చెందిన యువకుడు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు షేక్ షబ్బీర్ (33) చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి అప్పులు చేశాడు. అయితే అప్పుల బాధ భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న షేక్ అన్సర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.



షేక్ షబ్బీర్ (ఫైల్)

టిప్పర్ దొంగల అరెస్టు



టిప్పర్ దొంగలతో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ రమణారెడ్డి

మైదుకూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని కూడలిలో సోమవారం టిప్పర్ దొంగతనం చేసిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీయస్పీ రాజేంద్రప్రసాద్ వివరాలు తెలిపారు. టిప్పర్ యజమాని సాంబశివారెడ్డి వద్ద దేసిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి డ్రైవర్‌గా పనిచేసే వాడు. సాంబశివారెడ్డి డ్రైవర్‌కు రూ.29 వేలు కూలీ డబ్బులు ఇవ్వలేదనే నెపంతో ఈశ్వర్‌రెడ్డి తన స్నేహితులైన వేమిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పొరెడ్డి రామసుబ్బారెడ్డిలతో కలిసి టిప్పర్‌ను దొంగతనం చేశారు. గుంటూరుకు తీసుకెళ్లి విడిభాగాలు చేసి అమ్మి సమానంగా డబ్బులు పంచుకోవాలని వెళుతున్నారు. ఈ సమాచారం తెలియడంతో మైదుకూరు కూడలి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. నిందితులను సీఐ రమణారెడ్డి సిబ్బంది ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారని డీఎస్పీ అభినందించారు. కానిస్టేబుల్స్ శివగణేష్, తిరుమలయ్యలకు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ క్యాష్ రివార్డును అందచేశారు.

గోటూరులో అరుదైన పుట్టగొడుగు లభ్యం



పులివెందుల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని గోటూరు గ్రామంలో 1.3 కేజీల బరువు ఉన్న అరుదైన పుట్టగొడుగు లభ్యమైంది. సోమవారం గోటూరు గ్రామానికి చెందిన గంగాధర్ అనే రైతు పొలంలో ఈ పుట్టగొడుగు కనిపించింది. దీన్ని గ్రామంలో చూపించగా.. అల్లం పుట్టగొడుగుగా పిలుస్తారని కొందరు చెప్పినట్లు ఆ రైతు వివరించారు. ఈ పుట్టగొడుగు పూర్తిగా ప్రకృతి సిద్ధంగానే తన పొలంలో మొలిచిందని రైతు అంటున్నారు. కాగా, ఈ పుట్టగొడును తొండూరు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లగా.. తహసీల్దార్ రామచంద్రుడుతో పాటు మిగిలిన అధికారులు ఆశ్చర్యంగా తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11కేవీ డిగ్రీకళాశాల ఫీడర్, 11కేవీ ముద్దనూరురోడ్డు ఫీడర్,11కేవీ ప్రభుత్వ ఆసుపత్రి ఫీడర్ కింద ట్రీకటింగ్ కారణంగా ఆయా ప్రాంతంలో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12 వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. 11కేవీ ఎఫ్‌టీసీ ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా సుజాత హాల్, బైపాస్‌రోడ్డు ఏరియాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. సోమవారం మంగళగిరిలో ఉన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలిచైర్మన్ ప్రొఫెసర్ కొత్తమధుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు, ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్ యూనివర్సిటీ ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

కడప క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలంటే పోలీసుల ముందస్తు పర్మిషన్ తప్పనిసరి అని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప నగరంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, వివిధసంఘాల నాయకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వివిధ సమస్యల దృష్ట్యా ధర్నాలు, లేదా ర్యాలీలు నిర్వహించాలంటే వారం రోజుల ముందే పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. పోలీసుస్టేషన్‌లో అప్లికేషన్ తీసుకుని దాన్ని పూరించి కడప డీఎస్పీ ఆఫీసులో ఇవ్వాలన్నారు. ఎవరైనా కానీ ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు లేదా ర్యాలీ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ అదనపు లోడ్‌పై 50 శాతం రాయితీ

సింహాద్రిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) మార్గదర్శకాల ప్రకారం గృహ వినియోగదారులకు వారి విద్యుత్ కనెక్షన్‌కి లోడ్ పెంపుదలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు ఉందన్నారు. వినియోగదారులకు మరొక అవకాశం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ పథకం కింద రాయితీతో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకుని నెలవారి విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గిచ్చుకోవచ్చన్నారు. ఈ పథకం కింద 1 కిలోవాట్ సోలార్ వ్యవస్థకు రూ. 38 వేలు, 2 కిలోవాట్ల సోలార్‌కు రూ. 60 వేలు, 3 కిలోవాట్ల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వ్యవస్థలకు రూ. 78 వేల వరకు రాయితీ అందుతుందన్నారు.

గోపవరం మండల టీడీపీ పరిశీలకుడిగా మన్నూరు అక్బర్

చెన్నూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అన్ని మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు చేయవలసిన పనులు కొత్తగా ఏర్పాటు చేసే కమిటీల విషయమై అన్ని మండలాలకు టీడీపీ పరిశీలకులను పంపడం జరిగింది. అందులో భాగంగా చెన్నూరు మండలానికి చెందిన జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్‌ను గోపవరం మండల పరిశీలకునిగా నియమించడం జరిగింది. ఈ మేరకు అక్బర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ బాధ్యత అప్పగించినా సక్రమంగా నిర్వహిస్తామన్నారు.

'తల్లికి వందనం' పై విష ప్రచారం తగదు

చెన్నూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.13వేలు వంతున ఇచ్చిన మాట ప్రకారం అందించడంతో దానిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు ఆ పథకంపై విష ప్రచారం చేస్తున్నారని తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. చెన్నూరులో సోమవారం బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనంలో లబ్ధి పొందింది వైసీపీ వారేనన్నారు. వారు తమ పిల్లలకు ఈ పథకంలో లబ్ధి పొంది విష ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినప్పుడే ప్రతివిద్యార్థికి ఇస్తామని మాట చెప్పి ఆ ప్రకారం అందించడం జరిగిందని, అది సీఎం చంద్రబాబుకే చెల్లిందన్నారు. అయితే అమ్మఒడి పథకం ద్వారా గత వైసీపీ పాలకులు కేవలం ఒకరికే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.

ఫీజుల పేరుతో జరిగే దోపిడీని అరికట్టండి

కడప మారుతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులు, పుస్తకాల పేరుతో వేలాదిరూపాయల దోపిడీ జరుగుతున్నదని ఆంధ్రప్రదేశ్ బీ.సీ. సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు ఆరోపించారు. నిరసనగా ఏపీ. బీ.సి. సంక్షేమసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఆ సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కడప మారుతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఐయూఎంఎల్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ అలిషేర్ నాయకులకు సూచించారు. సోమవారం మట్టిపెద్దపులి వీధి సమీపంలో ఉన్న ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నూతనంగా కొత్తగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు వుంటుందన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారిలో ఎజాజ్‌అలీఖాన్, నిలోఫర్, ఖదీర్, హరీష్, లున్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు గౌస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత... తీరని చింత..!



కొక్కిరాయపల్లె రోడ్డుకు మోక్షమెప్పుడు..?

చెన్నూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న కొక్కిరాయపల్లె రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. పగలు, చీకటి తేడా లేకుండా ఆ దారిలో ఎప్పుడు వెళ్లాలన్నా కాసింత ఇబ్బంది పడాల్సిందే. పైగా ఏ చిన్నపాటి పని ఉన్నా ఆ గ్రామ ప్రజలు చెన్నూరు రావాల్సిందే. గ్రామంలో ఎక్కువగా సైకిళ్లు ఉండడంతో వారంతా పక్కనే ఉన్న మండల కేంద్రానికి ఆ వాహనంపై వస్తుంటారు. చిన్నాచితక పనులకు చెన్నూరుకు వచ్చి తిరిగి వెళుతుంటారు. ఆ గ్రామానికి కొన్నేళ్లుగా రోడ్డు సమస్య వెంటా డుతోంది. ప్రస్తుతం ఉన్న రోడ్డు అడుగుకో గుంత తీరని చింతలా మారింది. అర్ధకి లోమీటరు వరకు ఓ మాదిరి తారురోడ్డు ఉన్నా మిగతా రోడ్డంతా గుంతలమయమైంది. కంకర బయటకు తేలడంతో నిత్యం ఆదారిన రాకపోకలు సాగించే గ్రామ ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు రోడ్డు బాగు చేయండి మహాప్రభో అని పదేళ్లుగా వేడుకుంటున్నా వారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అన్ని గ్రామాలకు రకరకాల నిధులతో రోడ్డు వేస్తున్నారు తప్ప మా గ్రామం మీకు కనిపించలేదా, మేము మనుషులమే, మాకు అవసరాలు ఉంటాయి, మాకు మంచి రోడ్డు అవసరం. అని చెప్పుకుంటూ మొత్తుకుంటున్నా పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెన్నూరు వైపు గుంతలమయమైన కొక్కిరాయపల్లె రోడ్డు

గత టీడీపీ పాలనలో మంజూరైనా ...



గతంలో 2014-19 మధ్య టీడీపీపాలనలో రోడ్డు వేసేందుకు అంచనాలు తయారు చేశారు. నిధులు కూడా మంజూరయ్యే సమయంలో ప్రభుత్వం మారింది. వైసీపీ పాలన వచ్చింది. ఆ తరువాత ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. ఈ ఊరిలో ఇరుపార్టీల వారు ఉన్నారు. రోడ్డు అనేది అందరికీ అవసరమే. అలాంటప్పుడు నిర్లక్ష్యం చేయడంతో అందరం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడేమో రోడ్డు పరిస్థితి ప్రస్తుతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆయన వేస్తారని చెప్పారు

-సూర్యనారాయణ, కొక్కిరాయపల్లె

పులివెందుల ఏఓగా చెన్నారెడ్డి



పులివెందుల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఏవోగా చెన్నారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఏఓగా పనిచేస్తున్న నాగలక్ష్మి రాజంపేటకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వేముల మండలంలో పనిచేస్తున్న చెన్నారెడ్డి బదిలీపై పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

తొండూరు.. రాజు

పులివెందుల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండల వ్యవసాయాధికారిగా రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కర్నూలు జిల్లా కొసగి మండలంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తుండేవారు. బదిలీపై ఈయన తొండూరుకు వచ్చారు.

వేంపల్లి...శివశంకర్‌రెడ్డి

వేంపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఏఓగా ప్రొద్దుటూరులో పనిచేస్తున్న శివశంకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. వేంపల్లెలో పనిచేస్తున్న ఏఓ రాజేంద్రప్రసాద్ రాయచోటికి బదిలీపై వెళ్లారు.

నాఫెడ్‌సంస్థ, ఉల్లి కేంద్రానికి భూమి కేటాయించాలి

కడప,కలెక్టరేట్,జూన్ 16(ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలో ఉల్లి పరిశోధన కేంద్రం, నాఫెడ్ సంస్థ వాణిజ్య అవసరాలకు భూమి కేటాయించేలా చర్యలు తీసుకోవాలనీ పీజీఆర్‌ఎస్‌లో మైదుకూరుకు చెందిన మాజీ బీజేపీ కౌన్సిల్ మెంబరు వెంకట ప్రతాప్‌రెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ రెండు సంస్థలకు భూ కేటాయిం పులు చేసి ఆదుకోవాలని ఆయన కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో ఆయన పేర్కొన్నారు.

మా భూములను ఈనాం నుంచి తొలగించండి..: తమ పూర్వీకుల నుంచి పట్టా భూములను సాగు చేసుకొని జీవిసు న్నాం, జగనన్న రీసర్వే సమయంలో తమ పట్టా భూములకు ఈనాం భూములుగా జోడించారని దానిని తొలగించాలనీ పెండ్లి మర్రి మండలం, ఎగువ పల్లికి చెందిన రైతులు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను కలసి సోమవారం వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడు మనోసాగర్ రెడ్డి, నాగముని రెడ్డి, వేణుగోపాల రెడ్డి , రైతులు వెంకటసుబ్బయ్య, సహదేవరెడ్డి, శంకరరెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన నగరపాలక పాలన



మాట్లాడుతున్న వెంకటశివ

కడప సెవెన్ రోడ్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుర్చీల కుమ్ము లాటలో కడప నగర పాలక పాలన పడకేసిందని నగరంలో స్థానిక సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్న నేపథ్యంలో ఈనెల 20వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టినట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ పేర్కొన్నారు. సోమవారం నాలుగో డివిజన్ శాంతినగర్‌లో సీపీఐ రామకృష్ణ నగర్, శాంతినగర్ శాఖల మహాసభ నిర్వహించారు. సీపీఐ సభ్యులు బుక్కే శంకర్‌నాయక్, నగర కార్యవర్గ సభ్యురాలు వడ్ల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా టీడీపీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న లతారెడ్డి

పులివెందుల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా టీడీపీ ఉంటుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సతీమణి మారెడ్డి లతారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 34 మంది బాధితులకు మంజూరైన రూ.26లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపట్లపూర్తి భరోసా కల్పించి వైద్యం కోసం తగిన ఆర్థికసాయం టీడీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు.

నేడు మండల సమావేశం

వల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సభాభవనంలో నేడు నేడు మండల స్థాయి అధికారులతో సమావే శాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి క్రిష్ణకిశోర్‌రెడ్డి వస్తున్నందున మండల పరిధిలోని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కడప సెవెన్ రోడ్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికివందనం, సంక్షేమ పథకాలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఆప్కాస్, అంగన్వాడీ, మున్సిపల్ స్కీం వర్కర్లు, కార్మికులందరికీ వర్తింపజేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరిగి పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ యూని యన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల బాలికల హాస్టల్‌కు పదికోట్లు మంజూరు

వేంపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని స్వామివివేకానంద ప్రభుత్వ డిగ్రీకళాశాల బాలికల హాస్టల్ నిర్మాణానికి పదికోట్ల రూపాయలు కేంద్రం విడుదల చేసింది. ప్రధానమంత్రి ఉషా పథకం కింద ఈ నిధులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు.

డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలి..: వేంపల్లెలోని స్వామివివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. కళాశాల వేళల్లో నేరుగా వచ్చి దరఖాస్తు ఇవ్వాలని తెలిపారు.

వృద్ధులకు నేరుగా ఇంటికే నిత్యావసరాలు

లింగాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 65ఏళ్లు ఉన్న వృద్ధులందరికి నేరుగా ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు తీసుకెళ్లి పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. 1323 మందికి గాను 1190 మందికి పంపిణీ చేశామని లింగాల మండలం ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు, కార్డుల విభజన, కార్డులలో కుటుంబ సభ్యులను చేర్పడం కోసం 700 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇంకా అర్హులు ఉంటే కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేశామన్నారు.

రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి



లింగాల,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కోసం అర్హులైన రైతులందరూ ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఏవో రమేష్ తెలిపారు. లింగాల రైతు సేవ కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లింగాల మండలంలో 6777 మంది రైతులు అర్హత సాధించారని, ఇప్పటి వరకు 6635 మంది రైతులు పూర్తిచేసుకున్నారన్నారు. ఈనెల 18లోపు మిగిలిన రైతులు పూర్తిచేసుకోవాలన్నారు.

ఈకేవైసీని పరిశీలించిన ఏఓ

వేముల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుల, వేముల గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన జరుగుతున్న ఈకేవైసీని ఏవో జి.పి.ఓబులేసు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 6197 మంది రైతులు అర్హులు గుర్తించడం జరిగిందన్నారు. వారు తప్పక రైతు సేవ కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థుల జీవితాలకు ఊతమిస్తున్న చంద్రన్న



క్షీరాభిషేకం చేస్తున్న ఉమాదేవి

కడప మారుతీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల జీవితాలకు సీఎం చంద్రబాబు ఊతమిస్తున్నారని 49వ డివిజన్ కార్పొరేటర్ జి. ఉమాదేవి అన్నారు. సోమవారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు-వారి తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న యోగాంధ్రడే విజయవంతం చేయండి

వల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 21న నిర్వహించబడుతున్న యోగాంధ్రడేను విజయవంతం చేయాలని ఎంపీడీవో రఘురాం పంచాయతీ కార్యదర్శులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండపేటలో మురుగునీరు అడ్డుకట్ట తొలగింపు



సిమెంటు కట్ట తొలగించి మురుగునీరు వెళ్లడంతో శుభ్రపడిన వీధి

చెన్నూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామంలో ఉర్దూ పాఠశాలలోని వీధిలో రోడ్డులో అడ్డుకట్ట వేయ డంతో మురుగునీరు రెండేళ్లుగా నిలిచి అక్కడి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడేవారని, ఎట్టకేలకు సోమవారం ఆ అడ్డుకట్టను పగలగొట్టి నీరు బయటికి వెళ్లేలా చేయడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు తెలిపారు. అలాగే మురుగునీరు నిలిచి ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ కూడా చల్లామని తెలిపారు. పత్రికల్లో వచ్చిన కథనానికి స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో సోమవారం మురుగునీరు నిలిచిన ప్రాంతానికి వెళ్లి అడ్డుగా ఉన్న సిమెంటు కట్టలను తొలగించి మొత్తం అక్కడ శుభ్రం చేయించడం జరిగింది.

యువతి అదృశ్యం

కడప క్రైమ్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ రోడ్డు లోని విన్యాస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న యువతి అదృశ్య మైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు విన్యాస అపార్ట్‌మెంట్లో నివాసముంటున్న ఉప్పల సాయిశృతి ఈనెల 15వ తేదీన ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లింది. తర్వాత ఆ యువతి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె సోదరుడు సాయి సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా మున్సిపల్ విభాగ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఈటి రామచంద్రయ్య

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా అనుబంధ విభాగాల కమిటీలు నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం విభాగాల వారీగా మెంబర్లను విడుదల చేసింది. అందులో భాగంగా కడప నగరంలోని 22 డివిజన్ ఇన్‌చార్జి ఈటి రామచంద్రయ్యకు జిల్లా మున్సిపల్ విభాగ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి.

'తల్లికి వందనం' ఖాతాల్లో జమ..
బ్యాంకుల్లో పెరిగిన రద్దీ..!



వేంపల్లె, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా వేంపల్లె మండలంలో పెద్దఎత్తున లబ్ధిపొందారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న సుమారు 12వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.13వేలు జమ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ రకంగా అన్ని బ్యాంకులకు కలిపి సుమారు రూ.15కోట్ల మేర తల్లుల ఖాతాల్లో జమ అయింది. దీనితో వేంపల్లెలోని అన్ని బబ్యాంకులు రెండురోజులుగా రద్దీగా ఉన్నాయి. ఆయా ఖాతాదారులు బ్యాంకులకు వెళ్లి తమకు తల్లికి వందనం డబ్బు జమ అయిందో లేదో తెలుసుకోవడం, జమఅయిన డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం కోసం రావడంతో బ్యాంకులన్నీ రద్దీగా కనిపించాయి. ఒక్క వేంపల్లెలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లోనే సుమారు 1000మందికి సుమారు కోటి రూపాయలకు పైగా ఖాతాల్లో జమ అయిందని ఆ బ్రాంచ్ మేనేజర్ పురుషోత్తం తెలిపారు.

శీతల గోడౌన్లు త్వరలో నిర్మిస్తాం

మైదుకూరు రూరల్ ,జూన్ 16(ఆంధ్రజ్యోతి) : రైతుల సౌకర్యార్థం శీతల గోడౌన్లను త్వరలో నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక నంద్యాల రోడ్డులోని మార్కెట్ కమిటీలో సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే మైదుకూరు మర్కెట్ కమిటీ నుంచి మంచి ఆదాయం చేకూరుతోందని ఇక్కడ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మాణం, సిమెంటు రోడ్డులతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కమిటీ అంగీకారం తెలిపింది. మార్కెట్‌యార్డ్‌లోని ఒక గోడౌన్‌లో వైసీపీ ప్రభుత్వంలో వేసిన పైపులను వెంటనే తీసివేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర,బండి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టిన అక్బల్‌బాషా



జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలన అధికారిగా దువ్వూరు నుంచి బదిలీపై వచ్చిన అక్బల్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆయన పరిపాలన అధికారిగా బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో ఇక్కడే పనిచేశానని బదిలీపై దువ్వూరుకు వెళ్లడం జరిగిందన్నారు. తిరిగి ఉన్నతాదికారులు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారన్నారు. విధుల్లో సమస్యలు లేకుండా కార్యాలయంలోని సిబ్బందితో కలిసి మెలసి విధులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఆర్డీవో సాయిశ్రీతో ఆయన మాట్లాడారు.

జమ్మలమడుగుకు పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ మంజూరు

జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగుకు పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ మంజూరైనట్లు జమ్మలమడుగు అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సహకారంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జమ్మలమడుగుకు పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ మంజూరైందన్నారు. జమ్మలమడుగు పరిసర ప్రాంత పాలిసెట్ ర్యాంకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఈనెల 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే పాలిసెట్ కౌన్సెలింగ్‌కు జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇతర వివరాలకు 7901620171కు ఫోన్ చేసి తెలుసుకోగలరు.

తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన రమణమ్మ



ఖాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా సోమవారం ఏపీ రమణమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది శాలువాతో ఆమెను సత్కరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు రైతుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలని వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

దువ్వూరు తహసీల్దారుగా సంజీవరెడ్డి బాధ్యతలు స్వీకరణ



దువ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు తహసీల్దారుగా ఎం.సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడున్న తహసీల్దారు జమ్మలమడుగు ఆర్డీవో ఆఫీసులో ఏవోగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంజీవరెడ్డి నియామకం జరిగింది. రైల్వేకోడూరులో గోడౌన్ ఇన్‌చార్జిగా ఉన్న ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అధికార సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జమ్మలమడుగు తహసీల్దారుగా మహబూబ్‌బాషా




జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం తహసీల్దారు డి.మహబూబ్ బాషా బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఖాజీపేటలో తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కడపకు వెళ్లి అక్కడి నుంచి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఈయన జమ్మలమడుగు పట్టణానికి చెందినవారు.

విద్యుత్ వైర్లు ఇలా.. నాణ్యత ఎలా..?

ఖాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారి సమీపంలో విద్యుత్ స్తంభానికి 11 కేవీ వైర్లు అతుకులతో వేలాడుతున్నాయి. దీంతో గాలీవాన వచ్చినప్పుడు విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగులుకుని సరఫరా బ్రేక్‌డౌన్‌తో నిలిచి తద్వారా గ్రామాలు అంధకారంలో ఉండిపోవాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా విద్యుత్తు లైన్లు కిందకు వేలాడుతున్నా రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ విద్యుత్ అధికారులకు సూచిస్తున్నా వారు పట్టించుకోవడంలేదేని ప్రజలు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన గ్రామాల్లో ఇలాంటి సమస్యలు మరెన్నో ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రతి నెల రెండవ శనివారం విద్యుత్ తీగెల మరమ్మతులు చేస్తున్నామంటూ ఆ శాఖ అధికారులు కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేస్తున్నా ఇలాంటి 11 కేవీ వైర్లను ఎందుకు సరి చేయడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల గాలీవానకు విద్యుత్ వైర్లుగాని, స్తంభాలు గాని కిందపడితే ప్రమాదాలు చోటు చేసుకోవడంతోపాటు గ్రామాల్లో అంధకారం ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వకపోగా అతుకుల వైర్లతో ఉన్న కరెంటే సక్రమంగా ఇవ్వాలేని పరిస్థితులు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలా వేలాడుతున్న వైర్లను మరమ్మతులు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నారు.

విద్యుత్ ఏఈ ఏమన్నారంటే: ఇలాంటి సమస్యలు తమ దృష్టికి రాలేదని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ నాగరాజు పేర్కొన్నారు. 11 కేవీ విద్యుత్ వైర్ల అతుకుల విషయమై 'ఆంధజ్యోతి' వివరణ కోరగా ఎక్కడైనా ఇలాంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.



విద్యుత్ స్తంభానికి అతుకులతో ఉన్న 11 కేవీ వైర్లు

విద్యార్థులకు నోట్‌బుక్కులు వితరణ



విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్కులు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు పెంచలయ్య ఉచితంగా నోట్‌బుక్కులు అందజేశారు. పాఠశాలలో ఉన్న 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న 70 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థులకోసం ఉచితంగా నోట్‌బుక్కులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

మైలవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని 3,324 మంది విద్యార్థులందరికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా నోట్‌బుక్కులు, టెక్స్‌బుక్స్, యూనిఫారం తదితర సామగ్రిని ఉచితంగా విద్యార్థులందరికి అందజేసినట్లు ఎంఈవో చిట్టిబాబు తెలిపారు. సోమవారం మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేయడం జరిగిందన్నారు. మిగిలి ఉన్న విద్యార్థులకు సోమవారం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. తల్లికి వందనం పథకంలో భాగంగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాకు నగదు జమ అవుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సీఆర్‌పీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్వేలులోని విద్యార్థులకు ..



పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలలో విద్యార్థులకు సోమవారం అదే గ్రామానికి చెందిన కల్లూరు వెంకటరమణ, చంద్రావతిలు పలకలు, పెన్సిళ్లు, తదితర విద్యోపకరణాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపధ్యాయుడు ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలా ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. అనంతరం దాత చంద్రావతి మాట్లాడుతూ తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల పిల్లలకు వాటిని పంపిణీ చేసి నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండికోట ముంపువాసులకు న్యాయం చేయండి

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గండికోట ముంపువాసులకు న్యాయం చేయాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నరసింహా కోరారు. సోమవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన వినతిపత్రం అందజేశారు. గండికోట ముంపువాసులకు పెండిగ్ పరిహారం, అదనపు పరిహారం చెల్లించాలని, పునరావాసకాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కొండాపురం జడ్పీహైస్కూల్ నిర్మాణం చేపట్టాలని, నిర్మాణంలో ఉన్న తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్ పెండింగ్ పనులు పూర్తిచేయాలని జనవాణిలో కోరారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

కొండాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే-67 పై రోడ్డు ప్రమాదాల నివారణకు సోమవారం కొండాపురం స్టేట్‌బ్యాంక్ బస్టాప్ వద్ద బారికేడ్లను ఏర్పాటుచేశారు. బస్టాప్‌ల వద్ద రోడ్డు దాటేటప్పుడు తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. స్థానిక వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ బి.లింగేశ్వరరెడ్డి బారికేడ్లను తన సొంతఖర్చు తో ఏర్పాటు చేయించారన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్సై, సిబ్బంది అభినందించారు.

రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు



బయోమెట్రిక్ వేసేందుకు పడిగాపులు కాస్తున్న రైతులు

అట్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని రైతు సేవాకేంద్రాల వద్ద బయెమెట్రిక్ వేసేందుకు రైతులు సోమవారం పడిగాపులు కాశారు. అధికారులు మధ్యాహ్నం 2గంటల కావస్తున్నా రాకపోవడంతో మహిళా రైతులు రైతు సేవాకేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. జూన్ 20న రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలంటే రైతులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు పెట్టాయి. దీంతో రైతులు వేలిముద్రలను వేస్తేనే వారి ఖాతాలో రైతు భరోసా పడుతుందని రైతు సేవ కేంద్రాల అగ్రికల్చర్ అసిసెంట్లు తెలపడంతో రైతులు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. గత ప్రభుత్వం ఫోను నెంబరు ఓటీపీ ద్వారా రైతు భరోసా రైతు ఖాతాలకు జమ చేసేవారు. దీంతో పూర్తిస్థాయిలో రైతులు భూములు ఆన్‌లైన్‌లో కనిపించక ఇబ్బందులు పడ్డారు.

బద్వేలు సమగ్రాభివృద్ధికి పోరాటాలు తప్పనిసరి



మహాసభలో ప్రసంగిస్తున్న జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

బద్వేలు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బద్వేలు సమగ్రాభివృద్ధికి భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. బద్వేలులో జరగనున్న సీపీఐ 25వ మహాసభలను జయప్రదం చేయాలంటూ భాకరాపేట సమీపంలోని ఎద్దుల ఈశ్వర్ రెడ్డి నగర్‌లో నిర్వహించిన బద్వేలు రూరల్ మం డల ద్వితీయ మహాసభను పడిగ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అరుణ పతాకాన్ని సీపీఐ జిల్లాకార్యదర్శి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకులు మారుతున్నా ప్రజల తలరాతలు మారడంలేదని నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్లు, నీరు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 16సంవత్సరాల తరువాత కార్మిక కర్షక ఉద్యమమాలకు వేదికగా ఉన్నబద్వేలులో జూలై 22 నుంచి 24 వరకు జరుగుతున్న జిల్లా 25వ మహాసభలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యవర్గసభ్యుడు వీరశేఖర్, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, ఏరియా సహాయకార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గసభ్యులు వీవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు నాగరాజు, మహిళా సమాఖ్య నాయకురాళ్లు విజయమ్మ, సుబ్బారెడ్డి, తిరుమలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

ఖాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు నీరు అందించడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని కొండపేట కాలువ కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవి అన్నారు. సోమవారం పుల్లూరు సమీపంలో కేసీ కెనాల్‌కు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించడం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో చివరి ఆయకట్టుకు నీరు అందించాలన్న ధ్యేయంతో ముందస్తుగా కాలువ మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, వెంకటయ్య, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఖాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జడ్జి మైనుద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడిపాడు సమీపంలోగల లారెన్స్ వృద్ధాశ్రమంలో సీనియర్ సిటిజన్ యాక్టు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100ను కడప జిల్లా వరకు 112గా మార్చడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, లాయర్లు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారులకు సన్మానం



సబ్ ట్రెజరీ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

బద్వేలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు సబ్ ట్రెజరీ అధికారి వెంకటసుబ్బయ్య బదిలీపై కడపకు వెళ్లగా ఇక్కడికి నూతన ట్రెజరీ అధికారిగా సురేష్‌బాబు రావడంతో వారిని ఘనంగా సన్మానించారు. సోమవారం బద్వేలు విశ్రాంత సంఘ కార్యాలయంలో వారిని సన్మానించారు. అనంతరం ఆ సంఘం గౌరవ సలహాదారు గడి పుల్లం రాజు, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్యలు మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల సాధనకు నూతనంగా వచ్చిన సబ్ ట్రెజరీ అధికారి సహకరించి సమస్యలు తీర్చాలన్నారు. తదితర అంశాలను తెలియజేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి ముండ్లపాటి పిచ్చయ్య, ఆనందరావు, రామసుబ్బయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మైలవరం ఏవోగా గురుభాస్కర్

మైలవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండల వ్యవసాయాధికారిగా గురుభాస్కర్ సోమవారం వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మైలవరం ఏవోగా విధులు నిర్వహిస్తున్న విజయరావు గోపవరం మండలానికి బదిలీ అయ్యారు. గురుభాస్కర్ గతంలో మైలవరం ఏఈవోగా విధులు నిర్వహించారు. ఈయన ప్రస్తుతం ప్రొద్దుటూరు డివిజనల్ పరిధిలో ఆర్ఎస్‌కేలలో ఎరువుల సరఫరా, ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ అనాలసిస్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై మైలవరానికి వచ్చారు.

నవోదయ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా

బ్రహ్మంగారిమఠం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె పంచాయతీలో 30 ఎకరాలు పైబడి నవోదయ పాఠశాల నిర్మాణానికి చేపట్టేందుకు స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలోనే నిధులు కేటాయించి పనులను ప్రారంబించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్, ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే తోట్లపల్లె గ్రామంలో 500 మంది విద్యార్థులకు పైగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల మౌలిక వసతులు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు చేరలేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్ , ఎమ్మెల్యేలు పాఠశాలను సందర్శించి జూలై మొదటివారం కల్లా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించడంతోపాటు పాఠశాలను మొదటివారంలో ప్రారంభిస్తామ ని వారు తెలిపారు. కాగా 10.5 ఎకరాల శ్మశాన వాటిక స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బద్వేలు డివిజన్ ఆర్డీవో చంద్రమోహన్‌లు దర్శించుకున్నారు. వారికి ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజనరసింహనరేంద్ర, డీటీ జాన్సన్, మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కాణాల మల్లిఖార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీంద్ర, సర్పంచ్ నారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వేకారణంగా తల్లికి వందనం రాలేదు

● అర్హులకు న్యాయం చేయండి తహసీల్దార్‌కు వినతి



తహసీల్దారు దస్తగిరికి వినతిప్రత్రం అందిస్తున్న దృశ్యం

బి.కోడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వే తప్పులు తడకగా నిర్వహించడంతో అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం రాలేదని ఈవిషయమై తగు చర్యలు తీసుకోవా లని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతు న్నారు. ఆ మేరకు బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు తిప్పలూరు సుబ్బారెడ్డితో కలి సి సోమవారం తల్లికి వందనం పడని లబ్ధి దారులు తహసీల్దారు దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు మంది రైతులకు కలిపి ఒకే ఎల్‌పీ నెంబరు ఒక రైతుకు ఇవ్వడ ం తో భూమి ఎక్కువగా చూపుతున్నం దు ఆ రైతు కుటుంబాలకు తల్లికి వందనం పడలేదని వారన్నారు. ఒక్క బికోడూరు మండలంలోనే దాదాపు 600మంది విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం పడలేదని దీనిపై ఎందుకు పడలేదని విచారించగా గత ప్రభుత్వంలో రీసర్వే తప్పులతడకగా నిర్వహించి ఎల్‌పీ నెంబర్లు సక్రమంగా ఇవ్వకపోవ డంతో వారికి అధికంగా భూములు ఆన్‌లైన్‌లో చూపుతుండడంతో వారందరికీ తల్లికి వందనం నిధులు పడలేదన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి అర్హులైన వారికి తల్లికి వందనం పడేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరు గంటలపాటు విద్యుత్‌లేక అల్లాడిన 15 గ్రామాలు

కాశినాయన జూన్ 16(ఆంధ్రజ్యోతి) పిడుగుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 15గ్రామా లకు ఆదివారం సాయంత్ర 4గం నుంచిరాత్రి 10 గంటల వరకు దాదాపు 6గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. మండలంలోని ఓబుళాపురం, పిట్టిగుంట, పెండ్లిమర్రి, శంఖవరం, మహానందిపల్లె తదితర 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి సమస్యఏర్పడింది. ఈ మధ్య కాలంలో చిన్న గాలితోలినా చిరుజల్లులు కురిసినా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఏఈ లేకపోవడం క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయకపోవడం మూలంగానే చిన్న సమస్య వచ్చినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందటూ ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఏఈని ఏర్పాటుచేయడంతోపాటు కాలం చెల్లిన విద్యుత్ లైన్‌లను మార్పుచేసి భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శీతల గోడౌన్లు త్వరలో నిర్మిస్తాం

మైదుకూరు రూరల్ ,జూన్ 16(ఆంధ్రజ్యోతి) : రైతుల సౌకర్యార్థం శీతల గోడౌన్లను త్వరలో నిర్మించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక నంద్యాల రోడ్డులోని మార్కెట్ కమిటీలో సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధ్యక్షతన మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే మైదుకూరు మర్కెట్ కమిటీ నుంచి మంచి ఆదాయం చేకూరుతోందని ఇక్కడ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మాణం, సిమెంటు రోడ్డులతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కమిటీ అంగీకారం తెలిపింది. మార్కెట్‌యార్డ్‌లోని ఒక గోడౌన్‌లో వైసీపీ ప్రభుత్వంలో వేసిన పైపులను వెంటనే తీసివేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర,బండి అమర్‌నాధ్,తుపాకుల వెంకటరమణ,కొండపల్లి ఉమాకాంత్,మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయండి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, శానిటేషన్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, శానిటేషన్ కార్మికులకు సంక్షేమ పథకాలైన తల్లికు వందనం, ఉచిత సిలిండర్ వంటి పథకాలు అమలు చేయలని డిమాండ్ చేశారు. ఇప్ప టికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే నిరవధిక సమ్మె నిర్వహిస్తామన్నారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మాన్, పట్టణ అధ్యక్షుడు చంటి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, కమిటీ సభ్యులు గుర్రమ్మ, జాకోబు, రమాదేవి, శ్రీకాంత్, శాంతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వర్తింపజేయాలని యూనియన్ అధ్యక్షుడు నాగన్న కోరారు. ఆమేరకు కమిషనరర్ వెంకటరామిరెడ్డికి కార్మికులతో కలిసి వారొక వినతి పత్రం అందజేశారు. సోమవారం జమ్మలమడుగు పాత బస్టాండు మస్టర్‌పాయింట్ వద్ద పారిశుధ్య కార్మికులు మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులకు తల్లికి వందనం పథకం ఎవరికి రాలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఎవరికి తల్లికి వందనం పడలేదని ప్రభుత్వం తమకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ కమిటీ సభ్యులు, సహాయ కార్యదర్శి మైఖేల్, ప్రభావతి, బాల, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

జమ్మలమడుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం రాత్రి ఎస్.మల్లికార్జున అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో మట్టి కుప్పను ఢీకొని తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఇతను పోరుమామిళ్ల ఇటుకలపాడుకు చెందినవాడు కాగా దాల్మియాలో ఉద్యోగం కోసం వచ్చి జమ్మలమడుగులోని నాగులకట్ట వీధిలో నివాసం ఉంటున్నాడు. స్కూటరులో ప్రొద్దుటూరుకు వెళ్లి తిరిగి జమ్మలమడుగుకు వస్తూ రోడ్డుకు అడ్డంగా పెట్టిన మట్టి కుప్పను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అయితేమల్లికార్జున హెల్మెట్ ధరించడం వలన ప్రాణాపాయం తప్పిందని అయినా ఘటనా స్థలంలో అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇద్దరు కూతురు, భార్య ఆస్పత్రి వద్ద బోరున విలపించారు. అతన్ని మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.